# అతడు నేర్పిన పాఠం

*బండారు నారాయణరావు*

నిద్రమత్తు బాగావొదిలి, మెలుకువ వొచ్చి సుబ్బారావు పక్కమీద లేచికూర్చున్నాడు. టైము యెంత ఔతుందో! దీపంవత్తి తగ్గించి వున్నది. మంచంకిందవున్న రాగిచెంబు తీసి నాలుగు గుటకలు నీళ్లుతాగి లేచినుంచున్నాడు.

అనసూయ గోడపక్కకు వొత్తిగిలి పడుకుని వుంది.

అడుగులు నెమ్మదిగా వేసుకుంటూ బయట కొచ్చాడు సుబ్బారావు. విశాలాకాశంలో నక్షత్రాలు మిణుకుతున్నయ్. ఎటుచూసినా ఒక మబ్బుతునకైనా లేదు. వాతావరణం ప్రశాంతంగా వున్నది.

ఈ ప్రశాంతత యెంతోసేపు వుండదు! కాసేపట్లో మబ్బులు కమ్ముకొస్తై. మనస్సుకూడా అంతే! ఇప్పుడున్న మనోనైర్మల్యం మరు క్షణంలో వుండదు. మనుష్యులూ, మనస్సులూ పరిసరాలకు,వాతావరణానికీ బానిసలే!

టైము నాలుగున్నర ఐనట్టు సైరన్ కూసింది. ప్రశాంతత పటాపంచలైంది. వూరంతా ప్రతిధ్వనించి మోత సన్నగా తగ్గింది.

అతను తగ్గించివున్న దీపాన్ని పెద్దదిచేసి, బీర్వాదగ్గరకువెళ్లి పుస్తకాలు తడుముతున్నాడు. ఏ పుస్తకం చదవాలో తోచటంలేదు. ఒక నవలను బయటకుతీసి, కాస్సేపాలోచించి మరో ఆధ్యాత్మిక గ్రంథంతీసి మంచంమ్మీద కూర్చున్నాడు. పుస్తకం విప్పాడేకాని, మనసు లగ్నం కావటంలేదు. చెదరిపోయిన ఆలోచనల్ని కూడగట్టడానికి సిగరెట్ ముట్టించాడు.

రెండేళ్లనాటి జీవిత పరిస్థితులు మళ్ళీ యెందుకో జ్ఞప్తికొస్తున్నాయి. ఆ జీవితంలో సారమేమీలేదు. కని పెంచిన తలిదండ్రులు కూడా తనను చాలా నిర్లక్ష్యంగా చూశారు. ప్రతి కుటుంబంలోనూ డబ్బు సంపాదించే వాళ్లకే ఆధిక్యం వుంటుందేమో!

అప్పట్లో తను నిరుద్యోగి. తను, తనభార్య, చంటిపిల్లవాడుకూడా! ఇంతమందితో తను తండ్రికి బరువైపోయాడు. ఈ జ్ఞాపకాలు వాటంతటవే వస్తున్నయ్. ఆ సమయంలో వాళ్లు తనను గడ్డిపరకకంటే హీనంగాచూశారు. చూసినా అది వాళ్లతప్పుకాదనే ఈనాడు తోస్తూ వుంది. తలచుకునేకొద్దీ హృదయం ద్రవించి పోతుంది.

కష్టాలను అనుభవించినా, పోరులేని జీవితమే హాయిగా, సంతృప్తిగావుంది సుబ్బారావుకు. తలిదండ్రులతోవుండి కాపురం చేస్తున్నపుడు ఆనందం శూన్యం.

వేరే కాపురంపెట్టిన తర్వాతనైనా శాంతి లభిస్తుందేమోనని ఆలోచించాడు; నిజానికి అదివరకువున్న అశాంతే మళ్ళీ రేగింది! ఒకప్పుడు బాధ్యతారహితమైన బానిసత్వంలో వున్న స్వేచ్ఛ, స్వతంత్ర జీవనంలో వుండదని అనుకున్నాడు. అరాజకమైన పరిస్థితులకు తాళలేక స్వాతంత్ర్యంలో పడ్డాక వెనకటిభావం పోయింది. కొన్నాళ్లు గడిచేప్పటికి మళ్లీ మొదటికేవచ్చింది వ్యవహారం. ఇందులోనూ అసలైన మనశ్శాంతి వున్నట్టులేదు. వ్యక్తులను బట్టి, ఆయా పరిస్థితుల ప్రాబల్యాన్నిబట్టి ఆనందం అనేది వివిధరకాలుగాలభిస్తుందేమో!

సుబ్బారావు సామాన్య తరగతి దరిద్రుడు. దారిద్ర్యం అన్నితరగతులవారికీ ఒకటేఅయినా తక్కువ తరగతి దారిద్ర్యం ప్రజల్ని ఆకర్షించదు. బ్రతికి చెడ్డవాడు చేయిచాచకముందే ఆదరణ లభిస్తుంది. వాళ్ళమీద పేదవాళ్ళు కూడా సానుభూతి చూపుతారు. నిర్భాగ్యుడు చేయిచాచితే చూస్తూకూడా గమనించరు.

మొదటినుండీ సుబ్బారావు తనకష్టార్జితం మీదనే ఆధారపడవలసి వచ్చింది. అతనికి కొడుకు పుట్టాడని అత్తవారి దగ్గరనుంచి వార్త

వచ్చినపుడు సంతోషమనేది తనకేకాదు తలిదండ్రులకు కూడా కలిగింది. కాని అదిఎంతో కాలంనిలవలేదు. ఏడాది గడిచేప్పటికి యింట్లో గుసగుసలు బయలుదేరినై.

"వీడి సంపాదనచూస్తే దమ్మిడీలేదు—వీణ్ణి, వీడిపెళ్ళాం పిల్లల్ని పోషించటానికి మనం రాసిపుచ్చుకున్నామా?" అనేది తల్లి.

ఈ మాట సుబ్బారావు ఏ చాటునుండో ఆలకించేవాడు. కాని నోరెత్తే అధికారం తనకు లేదని ఆవిషయం మర్చిపోవటానికే యత్నించేవాడు.

ఎంతచెడ్డా తను మగవాడు; ఒక్కొక్కప్పుడు పౌరుషం పెల్లుబికేది కాని ఏమిచెయ్యటానికీ తను నిస్సహాయుడు; బక్కచిక్కిన సింహం కుక్కకు లోకువైనట్టు తోక ముడిచేవాడు.

ఆయింట్లో తన తండ్రికే సుబ్బారావుమీద ఆపేక్ష వుండేది. అది ప్రత్యక్షంగా చూపటానికి ఆయనగారికి దమ్ములుండేవి గావు. రహస్యంగా కొడుకు చేతికి అయిదూ, పదీ ఇస్తూ వుండేవాడు. ఈ విధంగా తండ్రిమనసు కరిగించి, తల్లికి తెలియకుండా పుచ్చుకోవడం సుబ్బారావుకు దొంగతనంగా పుచ్చుకున్నట్టు, తండ్రికి ద్రోహం చేస్తున్నట్టు తోచేది.

మరుక్షణం కరిగిన గుండె రాయిగా మారేది. ఏడాదికి తొమ్మిది మాసాలు, తన చెల్లెలు ఆమె పిల్లలు మొత్తం ఏడుగురు, తన తండ్రి యింట్లోనే గడుపుతారు.

వాళ్ళకయ్యేఖర్చు అంతా యింతా కాదు. కాఫీల దగ్గరనుంచి మేజోళ్ళవరకూ మంచి నీళ్ళ ప్రాయంగా ఖర్చుచేస్తారు. అటువంటప్పుడు తండ్రిదగ్గర తను అప్పుడప్పుడూ పుచ్చుకున్న ఐదూ, పదీ ఒక లెక్కా? పైగా ఆయన తనకు హృదయపూర్వకంగా ఇస్తున్నాడు. ద్రోహం చేసినట్టు యెలా ఔతుంది? తన చెల్లెల్ని, ఆమె పిల్లల్ని మేపగా లేని బరువు తన్నూ, తన భార్యనీ పిల్లవాణ్ణీ ఆదుకోవటానికే మోయలేని బరువుగా వుందా?

వేళ్ళసందునున్న సిగరెట్ సగం కాలింది కాని, గతించిన జీవిత సంగ్రహం స్మృతిపథంలో ఫిల్ము రీల్లా తిరుగుతూనే వుంది.

నెలరోజులక్రితం తండ్రిదగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఆ రోజు మొదలు తన తండ్రి పడుతున్న యిబ్బందులు కళ్లకు కట్టినట్లు కనిపించేవి. ఏ పని చేసినా మనసు నిలకడగా ఉండటంలేదు. కేవలం తను సంస్కారం గలవాడు గనక తన హృదయం ఎంత విశాలమై పోయిందీ! తనకు పట్టినగతే మరొకడికి పడితే ఒకప్పుడు నిర్లక్ష్యం చేసిన తలిదండ్రులను ఆ కొడుకు కన్నెత్తి చూస్తాడా?—అనిపిస్తుంది. ఏమైనా ఒకసారి స్వగ్రామం వెళ్ళి, అయిన వార్నీ, కానివార్నీ, చూసి పరామర్శించాలి. ముఖ్యంగా తన తండ్రి గురించైనా వెళ్ళితీరాలి.

సుబ్బారావు స్వగ్రామం విడిచి, పట్టణం వచ్చి రెండేళ్ళయింది. ఇంతవరకు, మళ్ళీ తన వూరు ముఖం చూడలేదు. చూడాలని కోరికా పుట్టలేదు.

అయినవాళ్ళే తనకు దూరమైనపుడు పుట్టి పెరిగిన జన్మభూమి మీద మమకారం సన్నగిలిందంటే అతనికి బ్రతుకుమీద యెంతో రోత పుట్టిందన్నమాట!

ఈ లోగా అనేక ఉత్తరాలు తన బంధువుల దగ్గరనుండి, స్నేహితుల దగ్గరనుంచీ వస్తూనే వున్నవి. వాటికి జవాబు రాయటానికి తీరిక ఉండటంలేదు. కాదు—రాయాలని మనసు పుట్టడము లేదు.

రెండు మూడుసార్లు స్వగ్రామం నుండి వచ్చిన ఉత్తరాలకు జవాబు రాద్దామని అనుకోవటం, ఊరుకోవటం కూడా జరిగింది. ఆ పని చెయ్యటానికి కొన్ని అభ్యంతరాలు కూడా లేక పోలేదు.

ముందుగా తన భార్యకు తెలియకుండా తన తండ్రికి ఉత్తరం రాసేందుకు వీల్లేదు. రాసే అధికారం తనకు లేదనికాదు. ఆ విధంగా చెయ్యటం సభ్యతకు విరుద్ధం.

ముఖ్యంగా భార్య గురించే వేరే కాపురం పెట్టాడు సుబ్బారావు. దానికి సందేహ మేమీ లేదు. ఈ పని తన భార్యగురించే చేశాడా, లేక తనగురించే చేశాడా? అన్న ప్రశ్న వేసుకుంటే, భార్యగురించే అని సమాధానంవస్తుంది.

కాని, అంతరాత్మతో వాదించకూడదు. పైకి మాత్రం తన ఇష్టానుసారంగానే ఆ పని చేశానని వాదిస్తాడు. నిజం చెప్పటానికి సాహసించాడా, మగవాడికి ఉన్న అధికారం కాస్తా దెబ్బతిన్నట్టే! రానురాను లోకం ఆ విధంగా తయారయింది.

• • •

అనసూయ సుబ్బారావుకు భార్యగా వుండి దారిద్ర్యం అనుభవిస్తున్నందుకు ఆమె బాధపడలేదు. తన అత్తమామలు ఆమెను నిర్లక్ష్యంగా చూసినందుకు ఆమె చిన్నబుచ్చుకోలేదు. ఆ యింట్లో తనభర్తకే అధికారం లేనపుడు తనకు మటుకు గౌరవం వుంటుందని కూడా ఆమె విశ్వసించలేదు. కాని, ఒక విషయం ఆమెను బాధించింది - పెళ్లికాలంలో తన ఒంటిమీద పెట్టిన పదికాసుల బంగారమూ తనకు దక్కకుండా అత్తగారు అమ్ముకుని యిబ్బందులు గడుపుకున్నందుకు. ఐనప్పటికీ, అనసూయ ముఖం చిట్లించుకోలేదు. తమను యింతగా దూరంచేసి మీతో మాకు లెక్కేమిటని త్రోసిరాజన్నారు. పైగా తన ఆడబిడ్డను, ఆమె పిల్లలను మేపగా లేని యాతన, తమభార్యాభర్తలను ఆదుకోవడంలో ఎందుకు అడ్డం వచ్చిందో అర్థంగాక ఆమె మనసు పూర్తిగా విరిగింది!

• • •

టైము ఆరుగంటలను తెలియజేస్తూ సైరన్ మళ్లీ కూసింది. వీధిలో వాకిళ్లు ఊడ్చేచప్పుడు వినిపిస్తున్నది. బాగా తెల్లవారింది. అనసూయ ఇంకా లేవలేదు. సుబ్బారావు చేతిలోవున్న పుస్తకం మడిచి, భార్య మంచందగ్గరకెళ్ళి "అనసూయా" అన్నాడు.

ఒళ్లు విరుచుకుంటూ ఆమెలేచి, యింత పొద్దున్నే తనను ఎందుకు లేపినట్టూ అనుకుంది.

"కాస్సేపు పడుకోలేకపోయారా, ఇవ్వాళ ఆదివారమేగా?" అన్నది.

"ఊరి కెళ్ళాలని అనుకుంటున్నాను!" అన్నాడు సుబ్బారావు గుండెలు చిక్కబట్టుకుని.

ఈమధ్య ఎప్పుడూ కలగని తలంపు యీ రోజున ఎందుకుపుట్టిందో అనసూయకు అర్థం కాలేదు.

"ఏవూరు?" అన్నది, ముఖం పైకి ఎత్తకుండానే.

"మానాన్నని చూడాలనివుంది."

"బాగానేవుంది....నే నడిగేది ఒకటి, మీరు చెప్పేదొకటీనూ—ఎప్పుడు వెళతారూ?"

"యివ్వాళే, ఎనిమిది గంటలకు."

"మళ్ళీ ఎప్పుడొస్తారు?"

సుబ్బారావు కాస్సేపు తమాయించుకుని, "బహుశా రెండు, మూడు రోజులు కావొచ్చు. మహాఅయితే ఒక వారంకంటే ఎక్కువపట్టదు" అన్నాడు. ఏదో మర్చిపోయినట్టు మళ్ళీ "త్వరగానే వచ్చేస్తాను" అని పూర్తిచేశాడు.

"త్వరగా రమ్మని నేను దండించినట్టు, ఆ మాటంటా రెందుకు?"

నిశితమైన విమర్శనా దృష్టిగల సుబ్బారావుకు, తన కంటే లౌకికంగా వెనకబడ్డ తన భార్యమాటకు జవాబు చెప్పటానికి జాగ్రత్త పడవలసి వచ్చింది. కాస్సేపటివరకు నోరు పెగల్లేదు. ఒక్క మాటలో తను ఎంత అసందర్భంగా తూలాడు!

"అసలు నాకు వెళ్ళాలనే లేదు" అన్నాడు.

"అదేమిటీ అలా అంటారు? మీరు వెళ్లటం చాలా మంచిది. ముఖ్యంగా నా కోరిక మీదనైనా మీరు వెళ్ళాలి" అన్నది అనసూయ.

సుబ్బారావు మారు మాటాడలేదు. వెంటనే బట్టలు సర్దుకుని స్టేషనుకు బయలుదేరాడు. బండిలో వెళ్ళుతూనే వూహించాడు.

యీ పరిస్థితుల్లో తన తండ్రిగారి స్థితి బాగా చితికిపోయి వుంటుంది. అందుకే ఆనాడు అంత యిదిగా రాసాడు... ఔనుమరి, వచ్చేరాబడి లేనప్పుడు ఎవరుమటుకు యేం చెయ్యగలరు? తన స్థితిమాత్రం ఏమంత బాగుంది గనకా? ఈసారి తన చెల్లెలు, ఆమె పిల్లలూ తండ్రిదగ్గరకు ఛస్తే రారు. అంతే! వాళ్ళ తెగులు అలా కుదరవలసిందే! పుష్కలంగా డబ్బు వున్నన్నాళ్లు పందికొక్కుల్లాగా తెగ

**(తరువాయి 40-వ పేజీలో)**